# టేకుల బస్తీలో ఘనంగా ముగ్గుల పోటీలు

**జనోదయ,బెల్లంపల్లి, జనవరి 27 :**

### చంద్రయ్య జ్ఞాపకాల్లో సేవా గంధం..

### వైష్ణవి సామాజిక శంఖారావం!

సాధారణంగా ముగ్గుల పోటీలు అంటే సంక్రాంతి సంబరాలు, కానీ బెల్లంపల్లి టేకుల బస్తీలో మంగళవారం రాత్రి జరిగిన ఈ పోటీలు మాత్రం 'సంస్కృతి సామాజిక బాధ్యత'ల కలయికగా దర్శనమిచ్చాయి. స్వర్గీయ చిలుముల చంద్రయ్య స్మారకార్థం *ఫౌండేషన్* వేసిన అడుగు బస్తీ రాజకీయాల్లో, సామాజిక వర్గాల్లో కొత్త చర్చకు దారితీసింది.

### సంప్రదాయం చాటున సామాజిక మేలు-కొలుపు


కేవలం ముగ్గులు వేసి బహుమతులు ఇచ్చి పంపేయడం కాకుండా, ఈ వేదికను సమాజ మార్పు' కోసం వాడుకోవడం ఇక్కడ విశేషం. ముఖ్య అతిథి గోడిసేల శ్రీహరి మాటల్లో ఒక పదును కనిపించింది. "వ్యక్తులు వెళ్ళిపోవచ్చు, కానీ వారి ఆశయాలు మరణించకూడదు" అన్న ఆయన వ్యాఖ్యలు, సమాజం కోసం పని చేసే వ్యక్తుల అవసరాన్ని నొక్కి చెప్పాయి. పూలే, పెరియర్ వంటి మహనీయుల ఆలోచనా దృక్పథాన్ని బస్తీ స్థాయికి తీసుకురావడంలో ఈ వేదిక సఫలీకృతమైంది. అంబేద్కర్ పెరియర్ ఆలోచన విధాన ఇప్పటి సమాజానికి అవసరం వారి ఆశయ సాధన తోనే సమాజంలో మార్పు సంభవిస్తుంది మహిళా శక్తి రాజ్యమేలుతుందని ఆయన అన్నారు

### .వారసత్వ సేవ.. వైష్ణవి

చిలుముల చంద్రయ్య అంటే ఆ బస్తీలో ఒక నిస్వార్థ ముద్ర. ఆ ముద్రను చెరిగిపోనివ్వకుండా, కేవలం నివాళులకే పరిమితం కాకుండా, ఆయన వారసురాలు వైష్ణవిఒక శక్తిగా ముందుకు రావడం ఇక్కడ గమనించాల్సిన అంశం. "ప్రజా సేవ చేయడమే లక్ష్యం" అని ఆమె ప్రకటించడం, భవిష్యత్తులో ఆమె ఒక బలమైన సామాజిక నాయకురాలిగా ఎదిగే సూచనలను స్పష్టం చేస్తుంది. మహిళా సాధికారత అంటే కేవలం చదువు, ఉద్యోగాలే కాదు.. సామాజిక బాధ్యతలో భాగస్వామ్యం కూడా అని ఈ పోటీ నిరూపించింది.

### బస్తీ చైతన్యం..

రామాలయ ప్రాంగణంలో రంగులతో నిండిన మహిళల చేతులు, కేవలం ముగ్గులనే కాదు, బస్తీ భవిష్యత్తును కూడా తీర్చిదిద్దగలవనే నమ్మకాన్ని కలిగించాయి. రజనీకాంత్, ఆరుముళ్ల హరిబాబు వంటి స్థానిక నాయకులు, అశోక్, హరీష్ వంటి యువత ఈ క్రతువులో పాలుపంచుకోవడం బస్తీలో మారుతున్న రాజకీయ, సామాజిక సమీకరణాలకు నిదర్శనం



టేకుల బస్తీలో విరిసిన ఈ రంగుల హరివిల్లు, రేపటి సామాజిక మార్పుకు తొలి అడుగు కావాలని ఆశిద్దాం

# చుక్కల దుప్పిని వేటాడిన కేసులో 13 మంది నిందితుల పై కేసు

**జనోదయ, గంగాధర | జనవరి 27 :**

బెల్లంపల్లి రేంజ్ పరిధిలో వేరు వేరు ప్రాంతాలలో చుక్కల దుప్పిని అక్రమంగా వేటాడిన రెండు ఘటనలకు సంబంధించి మొత్తం 13 మంది నిందితులను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం రాత్రి బెల్లంపల్లి అటవీ రేంజ్ అధికారి పూర్ణచందర్ తెలిపారు.

మొదటి ఘటన లింగాపూర్ గ్రామ శివారులో చోటుచేసుకోగా, అక్కడ ఒక చుక్కల దుప్పిని అక్రమంగా వేటాడిన ఘటనలో బట్వాన్పల్లి లంబాడి తండ గ్రామానికి చెందిన 9 మంది నిందితులను అదుపులోకి తీసుకొని, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

రెండవ ఘటనలో కృషి విజ్ఞాన కేంద్రం పరిధిలో చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో కూడా ఒక చుక్కల దుప్పిని అక్రమంగా వేటాడినట్లు నిర్ధారణ అయిందని ఈ కేసులో అదే గ్రామానికి చెందిన నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని, వారిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

ఈ దాడి కార్యక్రమంలో శ్రీ కే. గౌరీ శంకర్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, శ్రీ ఈ. శ్రీనివాస్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, శ్రీ ఆర్. శంకర్ రాథోడ్, శ్రీ ఈ. శ్రీధర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, శ్రీ సిహెచ్. సమ్మయ్య, అనిమల్ ట్రాకర్, శ్రీ టి. సుమన్ (డ్రైవర్) తదితర అటవీ సిబ్బంది పాల్గొన్నారు.





# వేములవాడ భీమన్న ఆలయంలో హనుమాన్ చాలీసా మహోత్సవం

## 141వ వారం నిరంతర పఠనం – భక్తి, ఐక్యతకు నిదర్శనం

**జనోదయ, వేములవాడ | జనవరి 27 :**

వేములవాడ భీమన్న ఆలయ ప్రాంగణంలో హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన హనుమాన్ చాలీసా కార్యక్రమం భక్తుల మనసులను ఆకట్టుకుంది. హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మోతిరి మధు నేతృత్వంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని హనుమంతుని నామస్మరణతో ఆలయాన్ని భక్తిమయంగా మార్చారు.

ఈ కార్యక్రమం 141వ వారం నిరంతరంగా కొనసాగుతున్న హనుమాన్ చాలీసా పఠన కార్యక్రమం కావడం విశేషం. ప్రతి వారం ఆగకుండా సాగుతున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం హిందూ సమాజంలో శ్రద్ధ, నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది.

వేములవాడ భీమన్న ఆలయంలో హనుమాన్ విగ్రహం ముందు భక్తులు సమూహంగా హనుమాన్ చాలీసాను పఠించగా, ఆలయ ప్రాంగణం మొత్తం "జయ హనుమాన్" నామధ్వనులతో మార్మోగింది. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఈ సందర్భంగా మోతిరి మధు మాట్లాడుతూ, "హనుమాన్ చాలీసా పఠనం కేవలం భక్తి కార్యక్రమమే కాదు... ఇది క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సేవాభావాన్ని పెంపొందించే సాధన. ప్రతి ఒక్కరూ భక్తితో పాటు మంచి మార్గంలో నడవాలని, సమాజంలో ఐక్యతను కాపాడాలని హనుమంతుడు మనకు బోధిస్తాడు" అని అన్నారు.

హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, యువత మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి,





ధార్మిక కార్యక్రమాల వైపు ఆకర్షితులవ్వాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. హనుమాన్ చాలీసా పఠనం మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే శక్తివంతమైన మార్గమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం ద్వారా భక్తి - సేవ - సామాజిక బాధ్యత అనే మూడు విలువలు సమాజానికి చేరాయని పలువురు భక్తులు అభిప్రాయపడ్డారు. వేములవాడ భీమన్న ఆలయంలో నిర్వహించిన ఈ హనుమాన్ చాలీసా కార్యక్రమం ఇతర గ్రామాలకు, పట్టణాలకు ఆదర్శంగా నిలిచే విధంగా సాగింది.

# నా వాళ్లే నన్ను మోసం చేశారు.. యువకుడి సెల్ఫీ సూసైడ్...

**జనోదయ, కరీంనగర్ | జనవరి 27 :**

తనవారే తనను మోసం చేశారనే తీవ్ర వేదనతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డ ఘటన కరీంనగర్ జిల్లా రామంచ గ్రామంలో కలకలం రేపింది. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో రికార్డు చేసిన యువకుడు తన గుండెను పిండేసే బాధను అందులో వెల్లడించాడు. తల్లిదండ్రులే మోసం చేస్తే తనకు ఇక ఆధారం ఎవరని ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రాణాలు తీసుకున్నాడు.వీడియోలో బాధితుడు నాగెల్లి వెంకటేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... కుటుంబ సభ్యులతో కలిసి తాను వ్యాపారం ప్రారంభించానని, అందుకు మొత్తం 10 లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టానని చెప్పాడు. అందులో 7 లక్షలు తన స్వంత పెట్టుబడి కాగా, 3 లక్షలు అప్పుగా తీసుకున్నానని వెల్లడించాడు. అప్పు పూర్తిగా తీర్చినప్పటికీ, వ్యాపార విషయమై కుటుంబ సభ్యులతో తరచూ గొడవలు జరుగుతూనే ఉన్నాయని వాపోయాడు.

తాము 17 లక్షల రూపాయలు పెట్టామని, ఆ మొత్తాన్ని పూర్తిగా చెల్లిస్తేనే దుకాణంలో కూర్చోవాలని తనను వేధించేవారని వెంకటేశ్వర్ రెడ్డి వీడియోలో పేర్కొన్నాడు. వారు ఇచ్చిన మొత్తానికి మించిన డబ్బు అడుగుతున్నారని, అయినప్పటికీ ఇప్పటికే 4 లక్షల రూపాయలు చెల్లించినట్లు తెలిపాడు. ఏడాది గడువు ఇస్తే మిగతా మొత్తాన్ని చెల్లిస్తానని చెప్పినా, కుటుంబ సభ్యులు వినలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

తల్లిదండ్రులు, అన్నదమ్ములే తనను మానసికంగా వేధిస్తున్నారని, తనను అణచివేసే ప్రయత్నం చేస్తున్నారని కలత చెందాడు. తాను పెట్టుబడి పెట్టిన డబ్బు రాకపోయినా పర్వాలేదని, కానీ మాటలుచర్యలతో ఇబ్బంది పెట్టడం తనకు భరించలేనిదని చెప్పాడు.

ఈ పరిస్థితుల్లో తన భార్యకు అన్యాయం చేస్తున్నాననే బాధ తనను తీవ్రంగా వెంటాడుతోందని వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నాడు. తన చావుకు భార్య ఎలాంటి కారణం కాదని వీడియోలో స్పష్టంగా చెప్పాడు. తన భార్యకు 10 లక్షల రూపాయలు అందించి, ఆమెను ఆమె తల్లిదండ్రుల ఇంటివద్ద సురక్షితంగా చేర్చాలని పోలీసులను కోరాడు. పెళ్లి చేసి పిల్లను ఇచ్చిన వారి వద్ద క్షమాపణలు కోరుతూ, తన భార్యకు మంచి భవిష్యత్తు కల్పించాలని విజ్ఞప్తి చేశాడు.

తన అంత్యక్రియలు కుటుంబ సభ్యుల ఖర్చులతో చేయవద్దని, తన స్నేహితుడు అజయ్ రెడ్డి చేతుల మీదుగా చితికి నిప్పు పెట్టించాలని కోరాడు. తన అస్తికలను ఉజ్జయినిలోని మహకాళేశ్వర్ సమీప నదిలో కలపాలని, అందుకు తన బ్యాంక్ ఖాతాలో ఉన్న డబ్బును ఉపయోగించాలని వీడియోలో అభ్యర్థించాడు. తన ఆత్మగౌరవం కోల్పోవడం ఇష్టం లేకనే ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పి చివరిసారిగా క్షమాపణలు కోరాడు

